

వసతి పాఠశాల విద్యార్థులకు అస్వస్థత

రాయచూరు, జూలై 24 : నగరంలోని చంద్రబండ రోడ్డులోగల మురార్జి దేశాయి మైనార్టీ వసతి పాఠశాల విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. బుధవారం ఉదయం అల్పాహారం తిన్న విద్యార్థులు కొద్దిసేపటికి కడుపునొప్పి, తలనొప్పి, వాంతులు విరేచనాలతో బాధపడడంతో అప్రమత్తమైన పాఠశాల సిబ్బం ది వెంటనే రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. విద్యార్థులకు ఎలాంటి అపాయం లేద ని వైద్య వర్గాలు తెలిపాయి. వసతి పాఠశాలను సందర్శించిన డీహెచ్‌ఓ డాక్టర్ సురేంద్ర బాబు, వండిన ఆహారంలో బల్లి పడినట్లు ఆరోపణలు వస్తున్నా తమ పరిశీలనలో ఏమి తేలలేదన్నారు. అన్ని రకాల శాంపిల్స్ సేకరించామని ఆయన తెలిపారు.



శాసనసభలో బీజేపీ సభ్యుల నిరసన

ముడాపై చర్చకు పట్టు

- అంగీకరించని స్పీకర్
- ఇష్టారాజ్యంగా ఇంటి స్థలాల పంపిణీ
- సీఎం కుటుంబ సభ్యులకు లబ్ధి
- ప్రతిపక్ష నేత అశోక్ ఆగ్రహం
- శాసనసభలో బీజేపీ నిరవధిక ధర్నా
- రాత్రి వరకూ కొనసాగిన ఆందోళన
- విధాన పరిషత్‌లోనూ నిరసన

బెంగళూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార (ముడా) ఇళ్ల స్థలాల పంపిణీలో కోట్ల రూపాయల అవినీతి జరిగిందని, దీనిపై చర్చకు అవకాశం ఇవ్వాలని బీజేపీ, జేడీఎస్ పార్టీల డిమాండ్‌కు స్పీకర్ అంగీకరించలేదు. దీంతో ప్రతిపక్ష బీజేపీ సభ్యులు స్పీకర్ యూటీ ఖాదర్ తీరును తప్పుబట్టారు. ప్రతిపక్షనేత అశోక్, సీనియర్ సభ్యుడు సునిల్‌కుమార్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం సభలో బీజేపీ సభ్యులు పోడియంలోకి దూసుకెళ్లి నిరసన తెలిపారు. వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో కోట్లాదిరూపాయల అవినీతి జరిగిందని స్వయంగా సీఎం అంగీకరించారని, మరోవైపు ముడా ఇంటి స్థలాల్లో సీఎం కుటుంబ సభ్యులే ఉన్నారని ప్రతిపక్షనేత అశోక్ మండిపడ్డారు. సీఎం కుటుంబానికి ఇచ్చిన ఇళ్లస్థలాలు వాపసు చేయాలని, 5వేల ఇళ్లస్థలాలను ఇష్టారాజ్యంగా పంపిణీ చేశారని వాటిని వాపసు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాప్రభుత్వంలో ఆందోళనకు అవకాశం లేదనేలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇటీవల చలో మైసూరుకు సిద్ధమైతే కెంగేరి వద్దనే అడ్డుకున్నారని అన్నారు. శాసనసభలో చర్చకు అవకాశం ఇవ్వకపోవడం ఎంతవరకు సమంజసమని స్పీకర్‌ను ప్రశ్నించారు. స్పీకర్ తీరును ఖండిస్తూ శాసనసభ, పరిషత్‌లో నిరవధిక నిరసన కొనసాగిస్తామన్నారు. ముడా స్థలాలను సీఎం భార్య పార్వతి పేరిట 14 ప్లాట్లు కేటాయించారని ఆరోపించారు. ఇంటి స్థలాలు వాపసు చేయాలంటే రూ.62 కోట్లు ఇవ్వాలని సీఎం కోరడం ఎంతవరకు సమంజసమన్నారు. ఇలా వాగ్వాదం జరుగుతుండగానే న్యాయ, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ ద్రవ్య వినియోగ బిల్లును ప్రవేశపెట్టేందుకు సిద్ధమయ్యారు. దీంతో మరోసారి ప్రతిపక్ష సభ్యులు ఆందోళన చేస్తుంటే బిల్లులు ప్రవేశపెట్టడం సమంజసమేనా అని ప్రశ్నించారు. సునిల్‌కుమార్ మాట్లాడుతూ మంత్రి బైరతి సురేశ్ సభలో ఓ ఎరుపు ఫైల్ పట్టుకుని పదే పదే చూపిస్తూ బీజేపీ పాలనలో అవినీతికి ఆధారాలంటూ నినాదాలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సభలో ముడా అవినీతిపై చర్చకు అవకాశం ఇవ్వడం సరికాదన్నారు. వేల కోట్ల రూపాయల అవినీతిపై చర్చ జరగలేదంటే శాసనసభ కార్యకలాపాలు ఎందుకంటూ సునిల్ కుమార్ ప్రశ్నించారు. దీంతో ప్రతిపక్ష సభ్యులు రాత్రింబవళ్లు ఆందోళన చేయాలని తీర్మానించారు. పరిషత్‌లోనూ ఇదే తరహాలో నిరసన సాగింది. రాత్రంతా హనుమాన్ చాలీసా భజనలతో గడుపుతామని బీజేపీ నాయకులు ప్రకటించారు.

ఫ్రీడం పార్కులో జేడీఎస్ ధర్నా

వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో అవినీతిని ఖండిస్తూ జేడీఎస్ ఆధ్వర్యంలో ఫ్రీడంపార్కులో బుధవారం ధర్నా చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అవినీతిపై సీబీఐ దర్యాప్తునకు అప్పగించాలని డిమాండ్ చేశారు. నిరసనలో ఎమ్మెల్సీ శరవణ, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అశోక్


అసెంబ్లీలో రాత్రి భజన చేస్తున్న బీజేపీ నాయకులు


ఫ్రీడం పార్కులో జేడీఎస్ నాయకుల ధర్నా


గేట్లు దాటి పరుగులు పెడుతున్న తుంగభద్ర


తుంగభద్ర డ్యాంకు చేరిన వరద

తుంగభద్రకు పెరిగిన వరద

10 గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల

98.961 టీఎంసీలకు చేరిన నిల్వలు

87,700 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

కంప్లి, జూలై 24 : తుంగభద్ర జలాశయానికి వరద పెరుగుతోంది. పై ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు ఎగువన ఉన్న తుంగ, భద్ర నదులు ఉప్పొంగి తుంగభద్ర డ్యాంకు వరద ఉధృతి పెరుగుతోంది. బుధవారం సాయంత్రం 10 గేట్లు ఎత్తి దిగువన ఉన్న శ్రీశైలం జలాశయానికి 18,686 క్యూసెక్కుల మేర నీటిని విడుదల చేశారు. వరద తీవ్రతను బట్టి నదికి క్రమక్రమంగా నీటి విడుదలను పెంచుతామని బోర్డు అధికారులు తెలిపారు. జలాశయం గరిష్ఠ నీటి మట్టం 1,633 అడుగులు, నీటి నిల్వ సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా ప్రస్తుతం 1627.21 అడుగుల వద్ద 98.961 టీఎంసీలు డ్యాంలో నీటిని నిల్వలు చేశారు. 87,700 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఇప్పటికే హంపి, కంప్లి భాగాల్లో పూర్తి స్థాయిలో నీరు ప్రవహిస్తోంది. నీటి ఉధృతి పెరగడంతో మత్స్యకారులు కూడా నది ఒడ్డునే వుండిపోయారు. ఇప్పటికే కంప్లి కోటే, సన్నాపురం, బెళగోడుహాళ్, ఇటిగి సన్నాపురం గ్రామాల్లో అధికారులు ముందస్తు హెచ్చరికలు చేపట్టారు. నది ఒడ్డున వుండే గ్రామప్రజలు అప్రమత్తంగా వుండాలని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో మరిన్ని గేట్ల ద్వారా నీటిని విడుదల చేసే అవకాశం వుందని అధికారులు తెలిపారు.


కంప్లి కోటె వద్ద నదిలో ప్రవహిస్తున్న నీరు

బీజేపీ నేత భర్త ఇంట్లో ఈడీ సోదాలు

కర్ణాటక వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్ నిధుల గోల్‌మాల్ కేసులో దర్యాప్తు

అక్రమాల్లో బీజేపీ నేత సుమతి సురతాని భర్త పాత్రపై అనుమానాలు


అనంతపురం నగరంలోని సుమతి సురతాని నివాసం వద్ద ఈడీ అధికారులు

అనంతపురం క్రైం, జూలై 24: బీజేపీ మహిళా మోర్చా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సుమతి సురతాని భర్త శ్రీనివాసులు ఇంట్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు బుధవారం సోదాలు నిర్వహించారు. అనంతపురం జిల్లా కేంద్రంలోని మారుతి నగర్‌లో.. ఓ అపార్ట్‌మెంట్‌లో శ్రీనివాసులు ఉంటున్నారు. కర్ణాటక రాష్ట్రంలోని వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్ నిధులను దారి మళ్లించిన కేసు దర్యాప్తులో భాగంగా ఈడీ అధికారులు అనంతపురానికి వచ్చారు. వాల్మీకి కార్పొరేషన్ నుంచి సుమారు రూ.187 కోట్ల నిధులు పక్కదారి పట్టిన విషయం తెలిసిందే. ఆ నిధులను కర్ణాటకలోని వివిధ జిల్లాలు, హైదరాబాదు, ఏపీలోని పలు బ్యాంకు ఖాతాలకు మళ్లించినట్లు ఈడీ అధికారులు గుర్తించారు. ఈ కేసులో ఇప్పటికే కర్ణాటక మాజీ మంత్రి నాగేంద్రతో పాటు 16 మందిని అరెస్టు చేశారు. హైదరాబాద్‌లోని కో-ఆపరేటివ్ బ్యాంకు నుంచి 270 ఖాతాలకు డబ్బు బదిలీ అయినట్లు ఈడీ అధికారులు గుర్తించారు. ఇందులో బీజేపీ నేత సుమతి సురతాని భర్త శ్రీనివాసులు పాత్ర ఉన్నట్లు భావిస్తున్నారు. బెంగుళూరు నుంచి రెండు వాహనాల్లో వచ్చిన పది మంది ఈడీ అధికారుల బృందం శ్రీనివాసులు ఇంట్లో సోదాలు నిర్వహించింది. ఆ సమయంలో ఆ ఇంట్లో ఎవరూ లేనట్లు తెలుస్తోంది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఇంట్లో పలు పత్రాలు, రికార్డులు పరిశీలించినట్లు తెలిసింది. అనంతరం ఇంటికి తాళం వేసి సీజ్ చేశారు. తమ అనుమతి లేకుండా ఇంటి తలుపులు తీయవద్దని, గౌహతిలోని ఈడీ జోనల్ కార్యాలయం-1కు తక్షణమే విచారణకు హాజరు కావాలని ఈడీ అసిస్టెంట్ డైరెక్టర్ రవికుమార్ రామ్ పేరిట నోటీసులు అతికించారు.


ఈడీ అధికారులు అతికించిన నోటీసులు

రామనగర దాకా మెట్రో

టెండర్‌ను ఆహ్వానించిన బీఎంఆర్‌సీఎల్

50 కిలోమీటర్లు నమ్మమెట్రో సేవల విస్తరణ

బెంగళూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మెట్రో రైలు సేవలు మైసూరు రోడ్డుమార్గంలో మరింత విస్తృతం కానున్నాయి. రామనగర జిల్లా బిడదిదాకా మెట్రో రైలు మార్గాన్ని విస్తరింపచేసేందుకు బెంగళూరు మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (బీఎంఆర్‌సీఎల్) సిద్ధమైంది. నివేదిక తయారు చేసేందుకు టెండర్లు ఆహ్వానించింది. బెంగళూరు నుంచి తుమకూరు మార్గంలో విస్తరించేందుకు ఇప్పటికే బీఎంఆర్‌సీఎల్ సిద్ధమైంది. దీనికితోడు మరో తీపికబురు చెప్పింది, రామనగరకు నమ్మ మెట్రో రైలు రానుందని కొంతకాలంగా ప్రచారం సాగుతోంది. బిడది దాకా విస్తరించేందుకు బీఎంఆర్‌సీఎల్ నిర్ణయించింది. దీన్నిబట్టి మూడు మార్గాల్లో నమ్మ మెట్రో సేవలు విస్తరణ కానున్నాయి. కార్యాచరణపై అధ్యయన నివేదిక కోసం హైదరాబాద్‌కు చెందిన కంపెనీకి టెండర్లు ఇచ్చారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో బీఎంఆర్‌సీఎల్ 50 కిలోమీటర్ల మేర నమ్మమెట్రో సేవలు విస్తరించాలని 68 కిలోమీటర్ల మేర కొత్త మార్గాల నిర్మాణానికి సంబంధించి కార్యాచరణ అధ్యయనం కోసం టెండర్లు ఆహ్వానించారు. ప్రస్తుతం టెండర్లను పూర్తి చేశారు. బీఎంఆర్‌సీఎల్ నివేదిక ప్రకారం చల్లఘట్ట - బిడది 15 కిలోమీటర్లు, సెంట్రల్ సిల్క్‌బోర్డు - హారోహళ్లి 24 కిలోమీటర్లు, బొమ్మసంద్ర - అత్తిబెలె 11 కిమీ మార్గం ఉంది. కాలేనఅగ్రహార - కాడుగూడి ట్రీ పార్క్ వయా జిగణి, ఆనేకల్ - అత్తిబెలె - సర్జాపుర, వర్తూరు (52.41 కిలోమీటర్ల కొత్తమార్గం) కూడా ఉంది. ఏ ప్రాజెక్టుపైన పెట్టుబడులకు అనుకూలం ఉందో అధ్యయనం చేయనున్నారు. ప్రాజెక్టు ప్రాథమిక అధ్యయనం, సాంకేతిక, సామాజిక, ఆర్థికత వంటి అంశాలలో ఈ నివేదిక తయారు చేస్తారు. నివేదిక పూర్తయితే ప్రాజెక్టు డీపీఆర్ తయారు చేస్తారు. వాటిలో భాగంగానే బిడదికి మెట్రో మార్గంపై అధ్యయనం కోసం టెండర్ల ప్రక్రియ జరిగింది. బిడదికి నమ్మమెట్రో సేవల విస్తరణ ఒప్పుకునే అవకాశం ఉంది. ఈ నివేదిక అంగీకరిస్తే బీఎంఆర్‌సీఎల్ డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టును తయారు చేసేందుకు ప్రత్యేక టెండర్‌ను పిలవనుంది. బెంగళూరు నగరం పారిశ్రామిక ప్రాంతాలలో పెట్టుబడుల ఆకర్షణకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది. బిడదిని పారిశ్రామిక హబ్‌గా మార్పు చేయడం ద్వారా నగరంపై ఒత్తిడి తగ్గించవచ్చునని భావిస్తున్నారు. ఇదే తరహాలోనే బీఎంఆర్‌సీఎల్ కూడా మెట్రో సేవలను విస్తరింపచేసే ఆలోచనలో ఉంది. ప్రతిరోజూ నగరం నుంచి బిడదిదాకా వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తారు. ఈ మార్గం సిద్ధమైతే బెంగళూరు నుంచి సంచరించేవారికి మరింత అనుకూలం కానుంది.



గవర్నర్‌ను కలిసిన బీజేపీ, జేడీఎస్ నేతలు


బెంగళూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కల్యాణ కర్ణాటక ప్రాంతంలో శాసనసభ్యులకు గ్రాంట్ల కేటాయింపులో వివక్షపై బీజేపీ, జేడీఎస్ ఎమ్మెల్యేలు మంగళవారం ప్రతిపక్షనేత అశోక్ నేతృత్వంలో రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్‌కు వినతి పత్రం ఇచ్చారు. వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్ అవినీతిపై ఈడీ అధికారులకు వ్యతిరేకంగా కేసు నమోదు విషయాన్ని గవర్నర్‌కు వివరించారు. ఈడీకి వ్యతిరేకంగా ఫిర్యాదు చేయడం ద్వారా దర్యాప్తును దారి తప్పించే ప్రయత్నం చేస్తున్నారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని తెలిపారు. కల్యాణ కర్ణాటక పరిధిలోని నిరుపేద వాల్మీకులకు ఉపాధితోపాటు పలువురికి ఉన్నత విద్య, స్వయం ఉపాధి వంటి అవకాశాలు కార్పొరేషన్ ద్వారా చేకూరేవని, కోట్లాదిరూపాయలు లూటీ చేశారని గవర్నర్‌కు విన్నవించారు. బీజేపీ, జేడీఎస్ ఎమ్మెల్యేలు గవర్నర్‌ను భేటీ అయిన రోజే ప్రభుత్వం గత బీజేపీ పాలనలో అవినీతిపై సిట్‌కు సిద్ధమయింది.

థీమ్‌పార్క్ అక్రమాలపై సీఎంకు కాంగ్రెస్ నేతల ఫిర్యాదు

ఉడుపి జిల్లా కార్కళలో నిర్మిస్తున్న థీమ్‌పార్క్‌లో అవినీతి జరిగిందన్న ఆరోపణలతో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ నేతృత్వంలో కాంగ్రెస్ ముఖ్యులు సీఎంను కలిశారు. థీమ్‌పార్క్ అక్రమాలపై సిట్ ద్వారా దర్యాప్తు జరిపించాలని వారు డిమాండ్ చేశారు. వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్ అవినీతిపై తారస్థాయిలో చర్చలు జరుగుతున్న తరుణంలోనే అధికార పార్టీ గతంలోని ఓ అంశాన్ని తెరపైకి తీసుకొచ్చింది.


సీఎంకు వినతి ఇస్తున్న కాంగ్రెస్ నేతలు


గవర్నర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ, జేడీఎస్ నాయకులు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1630.75	1,602.84
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	84,115	47,294
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	14791	213
సామర్థ్యం (టీఎంసీలు)	96.91	25.42

ముమ్మరంగా సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులు



ఏపీఎంసీ ఆవరణలో వేపడుతున్న సీసీ రోడ్డు పనులు

సిరుగుప్ప, జూలై 24: ఏపీఎంసీ ఆవరణంలో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. సిరుగుప్ప పట్టణ ఏపీఎంసీ ఆవరణలో నాబార్డు నిధుల కింద రూ.2.09 కోట్ల వ్యయంతో పనులను చేపట్టారు. ఈ పనులను ఏపీఎంసీ జిల్లా అసిస్టెంట్ ఇంజనీర్ మంజునాథ పర్యవేక్షిస్తున్నారు.

దివ్యాంగుల పింఛన్ పెంచాలి



ఎంఎల్‌సీ వై.ఎం సతీశ్

బళ్లారి సిటీ, జూలై 24: దివ్యాంగులకు పింఛన్ పెంచి వారి కుటుంబానికి ఆర్థిక సహాయం చేయాలని విధానపరిషత్ సభ్యులు వైఎం సతీశ్ విధానపరిషత్‌లో బుధవారం విజ్ఞప్తి చేశారు. దీనిపై రెవెన్యూ మంత్రి కృష్ణబైరేగౌడ మాట్లాడుతూ.. గత మూడు సంవత్సరాల వ్యవధిలో వికలాంగులకు పింఛన్ ఇవ్వడంలో కేంద్ర ప్రభుత్వం రూ.4,854లక్షలు, రాష్ట్రం రూ.3,88,935 లక్షలు వ్యయం చేశాయన్నారు. 40 శాతం నుంచి 75శాతం అంగవికలం ఉన్నవారికి నెలకు రూ.800 రూపాయలు, 75శాతానికి కంటే ఎక్కువ అంగ వికలత ఉన్న వారికి 1400 నుండి రూ.2000 రూపాయల పింఛన్ ఇస్తున్నట్లు తెలిపారు. కేంద్రప్రభుత్వానికి బడ్జెట్ రాకమునుపే ఈ విషయాన్ని విన్నవించినట్టు మంత్రి కృష్ణబైరేగౌడ స్పష్టం చేశారు.

జోరుగా విత్తన సాగు



బైలూరు వద్ద కంది విత్తనం వేస్తున్న రైతులు

కంప్లి, జూలై 24: మెట్ట భూముల్లో వర్షాలు పుష్కలంగా రావడంతో కురుగోడు పరిధిలోని బైలూరు, సింధిగేరి, తదితర గ్రామాలలో కంది, మొక్కజొన్న తదితర పంటలు విత్తుతున్నారు. ఈ ఏడాది అనుకున్నస్థాయి కన్నా వర్షాలు ఎక్కువగా వచ్చాయని రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటికే తుంగభద్ర జలాశయం ఆయకట్టులో నాట్లు కూడా ప్రారంభమయ్యాయి. ప్రభుత్వం రైతుసంపర్క కేంద్రం వద్ద క్యారలు, కంది, పొద్దుతిరుగుడు విత్తనాలను పంపిణీ చేస్తున్నారు.

నేడు లారీ ఓనర్ల సమావేశం


బళ్లారిరూరల్, జూలై 24: బళ్లారి లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం హలకుంది మఠంలో లారీ ఓనర్ల సమస్యలపై సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు అధ్యక్షుడు మించు శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. లారీ లోడింగ్, అన్‌లోడింగ్ విషయాలతోపాటు ఇతర సమస్యలపై సమావేశంలో చర్చిస్తామని తెలిపారు.

సిరుగుప్ప ఎస్ఐగా పరశురామ్



సిరుగుప్ప, జూలై 24 :సిరుగుప్ప పట్టణ పీఎస్‌ఐగా పరశురామ్ ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు వున్న ఎస్ఐ తిమ్మన్ననాయక్ వేరే ప్రాంతానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం ఎస్ఐగా పరశురామ్ బాధ్యతలు స్వీకరించారు. లా అండర్ ఆర్డర్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటానని ఆయన తెలిపారు.

ఆకట్టుకుంటున్న కబ్బర్గి ఫాల్స్



కుష్టగి వద్ద గలగల పారుతున్న కబ్బర్గి ఫాల్స్

విజయనగర జిల్లా కుష్టగి తాలుకాలోని కబ్బర్గి ఫాల్స్ పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. వర్షాలు భారీగా కురవడంతో గత రెండు మూడు రోజులుగా కబ్బర్గి వద్ద నీటి ప్రవాహం ఎక్కువయింది. దీంతో శివమొగ్గ ఫాల్స్ మాదిరిగానే ఈ ప్రాంతం కూడా పర్యాటకులకు ఆటపట్టయింది. సందర్శకులు ఆ ప్రాంతానికి వెళ్లి ఆనందిస్తున్నారు.

✍ కంప్లి

మిర్చి సాగుపై రైతుల విముఖత

● భారీగా జిల్లాలో ఎండుమిరప నిల్వలు



బళ్లారి సిటీ,జూలై 24: మార్కెట్‌లో ఎండు మిర్చి ఆశ్చర్య నానాటికీ పెరిగిపోవడంతో జిల్లాలో చాలామంది రైతులు మిర్చి పంటకు దూరమయ్యారు. బళ్లారి జిల్లాలో 37,963 హెక్టార్లు(93,809 ఎకరాలు) మిర్చి విత్తన లక్ష్యం కాగా ఇప్పటి వరకు 816.20 (2019 ఎకరాలు) హెక్టార్లలో మాత్రమే పంట వేశారు. గతేడాది ఈ సమయానికి సిజెంటా 4.6టన్నుల మిరప విత్తనాలను విక్రయించారు. ఈసారి 2.1టన్నుల విత్తనం మాత్రమే విక్రయించారు. గతేడాది మార్కెట్‌లో ఎండు మిర్చి క్వింటాలుకు రూ 50వేల పలకగా, ఈ సంవత్సరం ధరలు లేకపోవడంతో విక్రయదారులు, రైతులు శీతలీకరణ యూనిట్లలోనే పంటను ఉంచారు. జిల్లాలో 34 శీతలీకరణ యూనిట్లు ఉన్నాయి, 40లక్షల బస్తాల మిరప నిల్వ ఉంది. మిర్చి ఎగుమతులు తగ్గుముఖం పట్టాయి. పంటలో రసాయనాలు ఎక్కువగా ఉండడమే ఇందుకు కారణమని చెబుతున్నారు. ఆహార ఉత్పత్తు తయారీ సంస్థలు కూడా రసాయన రహిత పంటను మాత్రమే కొనుగోలు చేస్తున్నాయి. ఇంతే మిగిలిన పంట మార్కెట్‌లో అలాగే ఉందని, సంబంధిత వర్గాలు తెలిపాయి. గుజరాత్, మధ్యప్రదేశ్‌లలో కొన్నేళ్లుగా మిరప పండిస్తున్నారు. మన పంటతో పోల్చితే అక్కడ పంట నాణ్యత చాలా ఎక్కువ కాబట్టి మనకు మార్కెట్ దొరకడం లేదు. అక్కడి ప్రజలు కూడా ఇక్కడి మార్కెట్‌పై పట్టు సాధించడంతో ధర పడిపోయింది.

ఇబ్బందుల్లో అమ్మకందారులు

బాకీలు చెల్లించలేక, అమ్ముకోలేక మిర్చి రైతులు అవస్థ పడుతున్నారు. ఇటీవల కురుగోడు తాలూకాకు చెందిన నలుగురు రైతులు బకాయిలు చెల్లించలేక విషం తాగి ఆత్మహత్యకు యత్నించారు. తాజాగా పుట్టతిమ్మారెడ్డి అనే సేట్ మాన్ ఆత్మహత్య చేసుకున్నాడు. వ్యాపారులు బకాయిలు చెల్లించలేకపోవడంతో బళ్లారి జిల్లాలో పలువురు పోలీస్ స్టేషన్లను ఆశ్రయించారు. సంతోష్ నప్పండి డిప్యూటీ డైరెక్టర్, ఉద్యానవన శాఖ అధికారి మాట్లాడుతూ.. భోరుబావులు ఉన్నవారు మాత్రమే విత్తనం వేశారు, కాల్వలకు నీరు వచ్చిన వెంటనే విత్తనం వేగంగా వేస్తారని ఆయితే ఈసారి 10-15శాతం తక్కువ విత్తే అవకాశం ఉందన్నారు.

వరదలను ఎదుర్కొనేందుకు సర్వం సిద్ధం

● కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా

బళ్లారి సిటీ, జూలై 24: పరివాహక ప్రాంతాల్లో వర్షాలు అధికంగా కురుస్తుండటంతో తుంగభద్ర జలాశయానికి పెద్ద ఎత్తున ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోందని, తుంగభద్ర రిజర్వాయర్ నుంచి ఏక్షణమైనా నీరు విడుదలయ్యే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా తెలిపారు. అనంతపురం రోడ్డులోని ప్రభుత్వ న్యూ ప్రవాసీ మందిర్ (గెస్టుహౌస్)లో వ్యవసాయ సంబంధిత విషయాలపై తీసుకోవాల్సిన చర్యలపై ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చాటింపు(డంగురా)ద్వారా నదీ పరివాహక గ్రామాలను అప్రమత్తంగా ఉండాలని ప్రచారం చేస్తున్నామని, వరదలు, పంట నష్టం జరగకుండా జిల్లా యంత్రాంగం తగిన ఏర్పాట్లు చేసిందని తెలిపారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా

వర్షపు నీరు నిలిచి పోవడం వలన అంటు వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈనేపథ్యంలో డెంగ్యూ, మలేరియా ఇతర అంటువ్యాధుల నివారణకు అనుసరించాల్సిన చర్యలపై మరింత అవగాహన కల్పించాలని వైద్యారోగ్యశాఖ అధికారులను ఆదేశించారు.

పంటల బీమా నమోదుకు ఇదే సరైన సమయం

జిల్లాలో రుతుపవనాలు ప్రారంభమయ్యాయని, రైతులు ముందు జాగ్రత్త చర్యగా తమ పంటలకు బీమా చేయించుకోవాలని సూచించారు. ప్రస్తుతం వర్షాకాలంలో పసల్ బీమా పథకాన్ని అమలు చేస్తున్నట్లు ప్రధాన మంత్రి ప్రకటించారన్నారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టం జరిగితే పరిహారం పొందడానికి పంటల బీమా ఉపయోగపడుతుందని, అందుకు ఇదే సరైన సమయమన్నారు. జిల్లాలో భూకబ్జాదారుల నుంచి ప్రభుత్వ భూమిని కాపాడేందుకు రెవెన్యూ శాఖ ల్యాండ్ బీట్ పేరుతో సరికొత్త సాఫ్ట్‌వేర్‌ను రూపొందించిందన్నారు. ఈసాఫ్ట్ వేర్ భౌగోళిక సరిహద్దులు, రెవెన్యూ శాఖ పరిధిలోని ప్రభుత్వ ఆస్తుల సర్వే నంబర్‌తో సహా సమాచారం డిజిటల్ రూపంలో ఉంటుందన్నారు. ఇందుకోసం జిల్లాలో 55వేల ఆస్తులను గుర్తించి ప్రాపర్టీల కోసం జీపీఎస్ డేటా తీసుకున్నామన్నారు. ప్రభుత్వ ఆస్తుల ఆక్రమణ కేసుల్లో దీనివల్ల ప్రయోజనం ఉంటుందన్నారు. ఆస్తి యజమాని మరణిస్తే అతని కుటుంబ సభ్యులు లేదా వారసుల పేరిట ఆస్తి బదలాయింపు జరుగుతుందన్నారు. విలేకరుల సమావేశంలో జిల్లా పోలీసు సూపరింటెండెంట్ శోభారాణి, డిప్యూటీ కలెక్టర్ మహ్మద్ జుబేరా పాల్గొన్నారు.

29 నుంచి కుష్టువ్యాధి నిర్ధారణపై సర్వే

బళ్లారి సిటీ, జూలై 24: జిల్లాలో జూలై 29నుండి ఆగస్టు 14వరకు నిర్వహించనున్న కుష్టువ్యాధి నిర్ధారణ సర్వేని శాఖలవారీగా, స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో విజయవంతంచేయాలని కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా సూచించారు. నగరంలోని నూతన జిల్లా పాలనాభవనం హాల్లో మంగళవారం ఏర్పాటు చేసిన కుష్టువ్యాధి కేసుల గుర్తింపు అభియాన్ జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. లెప్రసీ అనేది బ్యాక్టీరియావల్ల వచ్చే ఒక అంటువ్యాధని, చికిత్స తీసుకోని కుష్ఠుతో దగ్గినా, తుమ్మినా గాలి ద్వారా ఆది ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుందన్నారు. ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స అందించడం ద్వారా వైకల్యాన్ని నివారించవచ్చని తెలిపారు.

కొత్తగా గుర్తించిన లెప్రసీ కేసుల వల్ల వచ్చే వైకల్యాన్ని 10శాతం కంటే తక్కువకు తగ్గించేందుకు స్వచ్ఛంద సంస్థల జూలై 29 నుంచి ఆగస్టు 14వరకు నిర్వహించనున్న లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్‌ను విజయవంతం చేయాలని అధికారులను కోరారు. ఆశా, అంగన్‌వాడీ వర్కర్లు, పురుష వాలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కరినీ తనిఖీ చేయాలని సూచించారు. జిల్లాలోని సిరుగుప్ప, బళ్లారి, సండూరు తాలూకాలలో కుష్టువ్యాధి నిర్ధారణ కార్యక్రమాన్ని ప్రారంభించామని. మొత్తం 2,15,390 ఇళ్లను 820 బృందాలతో తనిఖీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి రమేశ్‌బాబు తెలిపారు. జిల్లాలో వలస కార్మికులు పనిచేసే ఇటుక బట్టీలు, బిందెలు, సిమెంటు ఇటుకబట్టీలు, రైస్‌మిల్లు పరిశ్రమలతో పాటు మరో 45స్థలాలను గుర్తించామని, ఆరోగ్య శాఖ బృందాలు ఆ ప్రాంతాల్లో సర్వే నిర్వహిస్తాయన్నారు. ఆరోగ్య శాఖ బృందాలు ఇళ్లకు వెళ్లి తనిఖీలు చేస్తున్నప్పుడు ప్రజలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జిల్లాసర్జన్ డాక్టర్ బసారెడ్డి, జిల్లా లెప్రసీ నిర్మూలన అధికారి వీరేంద్రకుమార్, జిల్లా ఆర్‌సీహెచ్ అధికారి డాక్టర్ హనుమంతప్ప, జిల్లా రక్షిత వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్ అబ్దుల్లా, జిల్లాక్షయ నియంత్రణ అధికారి డాక్టర్ ఇంద్రాణి, జిల్లా సర్వేయర్ డాక్టర్ మరియండి, తదితరులు పాల్గొన్నారు.

కొత్తచట్టాలు ఉపయోగకరం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న లా కళాశాల అధ్యక్షుడు నరేంద్రబాబు

బళ్లారి సిటీ,జూలై 24: కేంద్రప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన మూడు చట్టాలపై ఏర్పాటుచేసిన ఈకార్యక్రమం లా విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని వీపీఎస్ లా కళాశాల అధ్యక్షుడు నరేంద్రబాబు అన్నారు. నగరంలోని వీపీఎస్ లా కళాశాల (వీరశైవ) ఆడిటోరియంలో బుధవారం సెంట్రల్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కమ్యూనికేషన్స్, చిన్న రుద్రప్ప న్యాయ కళాశాల, కన్నడ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో ఇండియన్ కోడ్ ఆఫ్ లాపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్‌గా పాల్గొన్న న్యాయవాది గురు బసవరాజు ఇండియన్ జ్యుడిషియల్ కోడ్ 2023గురించి వివరణాత్మక సమాచారాన్ని అందించారు. మరో రిసోర్స్ పర్సన్ బీదర్ డివిజన్ రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రూపొందించిన మూడు కొత్త చట్టాలు మొత్తం న్యాయవ్యవస్థకు జీవం పోశాయన్నారు. కార్యక్రమంలో సంగీత నాటక శాఖ నేత్ర కళాసంఘం సిరుగుప్ప బృందం ఆధ్వర్యంలో మూడు కొత్త చట్టాలపై అవగాహన నాటకం ప్రదర్శించారు. ఈసందర్భంగా బళ్లారి సెంట్రల్ కమ్యూనికేషన్స్ డిపార్ట్‌మెంట్ అధికారి ఎస్.రామకృష్ణ, న్యాయవాది నీలాగౌడ, కన్నడ సాహిత్య పరిషత్ జిల్లా అధ్యక్షుడు నిష్టిరుద్రప్ప, కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ చంద్రిక, ఇతర కళాశాల లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రారంభానికి నోచుకోని దోబీఘాట్



కుడితినిలో నిరుపయోగంగా దోబీఘాట్

కంప్లి, జూలై 24: కుడితిని పట్టణంలో దోబీఘాట్ ఏర్పాటై ఎన్నో నెలలు గడిచినా ఇంతవరకు ప్రారంభానికి నోచుకోలేదని చాకలి వారు వాపోతున్నారు. గతంలో చాకలి వారికి బట్టలు ఉతికేందుకు నీరు నిల్వ వుంచుకోవడానికి ఎమ్మెల్యేగా వున్న తుకారామ్ హయాంలో దోబీఘాట్ కోసం నిధులు మంజూరు చేయించారు. పనులు పూర్తయి దోబీఘాట్ ధ్వంసమవుతున్నా, గోడలు, కొళాయిలు విరిగిపోతున్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా దిష్టిబొమ్మగా నిలిచిన దోబీఘాట్‌ను త్వరగా ప్రారంభించి వారికి అనుకూలించేలా చర్యలు చేపట్టాలని కోరారు.

సంకష్టహర గణపతికి ప్రత్యేక పూజలు



కంప్లి, జూలై 24 :కంప్లి పట్టణంలోని గంగావతి రోడ్డులో సంకష్టహర చతుర్థి సందర్భంగా ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా వినాయకుడికి భక్తులు అధిక సంఖ్యలో ఉండ్రాళ్లు, కుడుములతో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వామివారికి పూలు, పండ్లతో పూజలు నిర్వహించి మొక్కులు సమర్పించుకున్నారు. ప్రతి నెలా సంకష్ట హర చతుర్థికి వరసిద్ధి వినాయకుని ఆలయంలో ప్రత్యేక పూజలు జరుగుతాయని ఆలయ కమిటీ కార్యదర్శి తెలిపింది.

ఆన్‌లైన్ స్కీముల వలలో గ్రామీణ ప్రజలు

బళ్లారి రూరల్, జూలై 24 :బళ్లారి జిల్లాలోని నగరంతో పాటు పలు గ్రామాల్లో ఆన్‌లైన్ స్కీముల ద్వారా ఎన్నో కుటుంబాలు రోడ్డున పడాల్సి వస్తోంది. ఆన్‌లైన్ యాప్ ద్వారా డబ్బు వస్తుందని ఆశతో లక్షలు లక్షలు అప్పులు చేసి అమాయక ప్రజలు ఆన్‌లైన్ మోసాలకు బలవుతున్నారు. మోసాలకు గురైన మరికొన్ని కుటుంబాలు బయటకు చెప్పుకోలేక కుమిలిపోతున్నాయి. మోసపోయిన బాధిత కుటుంబాలవారిలో కొందరు సైబర్ క్రైమ్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తున్నారు. ప్రజలు, డబ్బు కోసం కక్కుర్తి పడి ఆన్‌లైన్ స్కీములకు బలికావద్దని పోలీసులు ప్రజలను హెచ్చరిస్తున్నారు.

రైలు కిందపడి విద్యార్థి ఆత్మహత్య

బళ్లారిరూరల్, జూలై 24 : బళ్లారి తాలూకా సిడిగిన గ్రామానికి చెందిన గోవింద్ కుమారుడు కులస్వామి(18) ఇంటర్ రెండవ సంవత్సర పరీక్షల్లో ఫెయిల్ కావడంతో మంగళవారం హగరి రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిని స్థానికులు గమనించి సమాచారం ఇవ్వడంతో రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని బళ్లారి విమ్స్ ఆసుపత్రికి తరలించారు. దీనిపై బళ్లారి రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. విద్యార్థి తల్లిదండ్రులు చేతికొచ్చిన కొడుకు కళ్లముందే శవమై కనిపించడంతో బోరుమని విలపించారు.

రాయచూరు ఏడీసీ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న శివప్ప

రాయచూరు, జూలై 24: రాయచూరు నూతన అదనపు జిల్లాధికారిగా శివప్ప యల్లప్ప భజంత్రి మంగళవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసి బదిలీపై వెళుతున్న ఏడీసీ డాక్టర్ కేఆర్ దుర్గేశ్ సిబ్బంది, అధికారులు మనంగా స్వాగతించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. గడచిన నాలుగు ఏళ్లుగా ఆయన అందించిన సేవలను గుర్తు చేసుకుంటూ ఆయనకు అధికారులు, సిబ్బంది వీడ్కోలు పలికారు.

హోసూరు జోన్

మూడు చట్టాలను ఉపసంహరించుకోవాలి



నిరసన తెలుపుతున్న సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు

హోసూరు(సిప్‌కాట్) జూలై 24 : కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన మూడు చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ హోసూరులో డాప్స్, సీఐటీయూ, ఏఐటీయూసీ నిరసన చేపట్టాయి. ఈ చట్టాలకు వ్యతిరేకంగా హోసూరులో ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శనకు డాప్స్ జిల్లా కౌన్సిల్ కార్యదర్శి గోపాలకృష్ణన్ అధ్యక్షత వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీధర్, అధ్యక్షులు నాగేశ్‌వడేవన్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మాదయ్యన్ నాయకత్వం వహించారు. కృష్ణన్, డాప్స్ అసెంబ్లీ కార్యదర్శి జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణమూర్తి , డిప్యూటీ సెక్రటరీ జాకబ్ రాజ్, టాస్మాక్ ఎల్‌పిఎఫ్ రవిచంద్రన్ చట్టాలను ఖండిస్తూ ప్రసంగించారు. ప్రతిపక్షాలను బహిష్కరించి ఆమోదించిన చట్టాలను ఉపసంహరించుకోవాలని కోరారు. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి పూర్తిగా నిధులు అందించలేదని, అంగన్‌వాడీ, ఎయిడెడ్ పిల్లల ఆల్పాహార పథకం వర్కర్ల వేతనం పెంచాలని, ఖాళీ పోస్టుల భర్తీ చేయాలనే పలు డిమాండ్లతో నిరసన తెలిపారు. ఇంకా ఈ ప్రదర్శనలో ఎల్‌పిఎఫ్ నిర్వాహకులు అంగన్‌వాడీ వర్కమ్మ, రేషన్ దుకాణదారుల వెంకటస్వామి, వరతరామన్, శ్రీనివాస్, రాజేశ్, గోవిందరాజ్, సెంద్య మోహన్, గోవిందరాజ్, యశోద, ఆటో ఎల్‌పిఎఫ్ రమ్య, కుమార్, శక్తివేల్, సంజీవన్, శివకుమార్ పాల్గొన్నారు.

నగరంలో మొక్కలు నాటాలి

హోసూరు, జూలై 24: హోసూరు కార్పొరేషన్‌లోని ఆమోదించబడిన హౌసింగ్ ప్రాంతాలలో, తాలూకా ఆఫీస్ రోడ్డు రింగ్ రోడ్డు నుంచి బౌటర్ రింగ్ రోడ్డు వరకు మొక్కలను నాటాలని నగర ప్రణాళిక కమిటీ చైర్మన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో తీర్మానించారు. హోసూరు కార్పొరేషన్ హాలులో నగర ప్రణాళిక కమిటీ చైర్మన్ ఆశోకరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం సమావేశం జరిగింది. సమావేశంలో రోడ్డు పక్కన వాహనాల పార్కింగ్ ఏర్పాటుచేసి, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడాలని తీర్మానించారు.

మాజీ సైనికుల కోసం ఫిర్యాదుల పరిష్కార సమావేశం

హోసూరు(కృష్ణగిరి) జూలై 24: మాజీ సైనికులు, వారిపై ఆధారపడిన వారి వినతిపత్రాలపై తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మాజీ సైనికుల కోసం ప్రత్యేక గ్రీవెన్స్ రిడ్రెసల్ డే సమావేశం కలెక్టర్ కె.ఎం.సరయు అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సమావేశంలో కృష్ణగిరి జిల్లాకు చెందిన మాజీ సైనికోద్యోగుల కుటుంబాలకు చెందిన 37 మంది తమ డిమాండ్లను జిల్లా కలెక్టర్‌కు సమర్పించారు. ఇంకా ఏడుగురు మాజీ సైనికుల పిల్లల చదువుల కోసం రూ.2.50 లక్షల విలువైన విద్యా ఉపకార వేతనాలను మాజీ సైనికుల సంక్షేమ ప్యాకేజీ నిధి నుంచి రూ.23,663 వడ్డీ రాయితీని జిల్లా కలెక్టర్ అందించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎ.సాధనరాజ్, మాజీ సైనికుల సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ లెఫ్టినెంట్ కల్నల్ ఆర్.వి.వేలు, కృష్ణగిరి డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ తమిళరస్, జిల్లా పారిశ్రామిక కేంద్రం ప్రాజెక్టు మేనేజర్ రామమూర్తి మాజీ సైనికులు పాల్గొన్నారు.



విద్యారుణం అందిస్తున్న కలెక్టర్

డెంగీ నియంత్రణకు ప్రజలు సహకరించాలి



డెంగీ నియంత్రణపై జాతాను ప్రారంభిస్తున్న డీసీ సతీష్

రాయచూరు, జూలై 24: జిల్లాలో డెంగీ వ్యాధి ప్రబలకుండా ఆరోగ్య శాఖ ఇచ్చే సూచనలు, సలహాలు ప్రతిఒక్కరు పాటించి సహకరించాలని జిల్లాధికారి సతీశ్ కోరారు. డెంగీ వ్యాధి పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకోసం ఏర్పాటు చేసిన జాతా కార్యక్రమాన్ని బుధవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద ప్రారంభించారు. జాతాను ప్రారంభించిన జిల్లాధికారి వర్షపు నీరు ఇళ్ల పరిసరాల్లో నిల్వ ఉండకుండా జాగ్రతలు తీసుకోవాలన్నారు. దీంతో పాటు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఇచ్చే సూచనలు, సలహాలు విధిగా పాటించాలని తద్వారా ప్రాణాంతక వ్యాధి నియంత్రణలో భాగస్వాములు కావాలన్నారు. కాగా డెంగీ ప్రబలకుండా తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి అధికారులు నగరసభ, పురసభ, గ్రామ పంచాయతీ, తాలూకా పంచాయతీల పరిధిలో పనిచేసే వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ఇంటింటి ప్రచారం చేయాలన్నారు.

ముదగల్ హుసేనీ ఆలం దర్గా హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న అధికారులు

రాయచూరు, జూలై 24 : ముదగల్ పట్టణంలోని హుసేనీ ఆలం దర్గా హుండీని మంగళవారం సాయంత్రం లెక్కించారు. వక్ఫ్‌బోర్డ్ అధ్యక్షుడు అధికారి సమక్షంలో జరిగిన లెక్కింపులో మొత్తం 11.79 లక్షల మేరకు కానుకలు అందినట్టు దర్గా కమిటీ నిర్వాహకులు తెలిపారు. గత ఏడాది హుండీ ఆదాయం 10.86 లక్షలు కాగా ఈ ఏడాది హుండీఆదాయం పెరిగినట్టు తెలిపారు. కార్యక్రమంలో వక్ఫ్ కమిటీ జిల్లా అధ్యక్షుడు ఫరీద్ ఖాన్, అధికారి సలీం పాషా, దర్గా కమిటీ బాధ్యులు గఫూర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మనస్విని పింఛన్ల కోసం కరవే ఆందోళన

రాయచూరు, జూలై 24 : జిల్లాలో మనస్విని పథకం ద్వారా అర్హులైన పింఛన్‌దారులకు పెండింగ్‌లో ఉన్న పింఛన్ సొమ్మును వెంటనే విడుదల చేయాలని కర్ణాటక రక్షణ వేదిక నాయకులు కోరారు. పింఛన్ విడుదలలో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ బుధవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద కరవే నాయకులు ఆందోళన నిర్వహించి రెవెన్యూమంత్రికి జిల్లాధికారి ద్వారా వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడిన కరవే నాయకులు గడచిన నాలుగు నెలలుగా పింఛన్‌దారులకు డబ్బులు అందకపోవడంతో కుటుంబాల నిర్వహణ భారంగా మారిందన్నారు. ఆధార్ అప్‌డేట్ కోసం దరఖాస్తు చేసి నెలలు గడుస్తున్నా అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు.

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

సెమ్మంగుడి శ్రీనివాస అయ్యర్ (జయంతి)



ఆధునిక కర్ణాటక సంగీత పితామహగా పేరొందిన 'పద్మ విభూషణ్' పురస్కార గ్రహీత సెమ్మంగుడి రాధాకృష్ణ శ్రీనివాస అయ్యర్ 1908 జూలై 25న తమిళనాడు రాష్ట్రం తంజావూరు జిల్లా తిరుక్కోడివల్‌లో జన్మించారు. సమకాలీనులైన జీఎన్ బాలసుబ్రమణియమ్, మధురై మణి అయ్య ర్‌లతో కలసి 20వ శతాబ్దపు కర్ణాటక సంగీతత్రయంగా పేరొందారు. తిరువనంతపురంలోని స్వాతి తిరునాల్ సంగీత కళాశాలకు ప్రిన్సిపాల్‌గా, ఆలిండియా రేడియో మద్రా స్‌లో కర్ణాటక సంగీతంలో చీఫ్ ప్రొడ్యూసర్‌గా పని చేశారు. శిష్యులు ఆయనను 'సెమ్మంగుడి మామ' అని ఆప్యాయంగా పిలుస్తారు. 'పద్మభూషణ్', 'సంగీత కళానిధి' ఇతర పురస్కారాలు, కేరళ విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. 2003 అక్టోబరు 31న కన్నుమూశారు.

కైకాల సత్యనారాయణ (జయంతి)



'నవరస నటనా సార్వభౌమ' బిరుదు పొందిన కైకాల సత్య నారాయణ 1935 జూలై 25న కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు మండలం కౌతవరం గ్రామంలో జన్మించారు. తెలుగు సినిమా గోల్డెన్ ఎరాలో గొప్ప నటులలో ఒకరిగా నిలిచారు. ఆరు దశాబ్దాలలో 750కుపైగా సినిమాలలో నటించారు. పౌరాణిక, జానపద, సాంఘిక, యాక్షన్ సినిమాలలో విభిన్న పాత్రలలో నటించి అభిమానులను అలరించారు. రఘు పతి వెంకయ్య జాతీయ సినీ పురస్కారం అందుకున్నారు. ఫిల్మ్‌ఫేర్, నంది అవార్డు, జీవిత సాఫల్య పుర స్కారం ఇతర అవార్డులు అందుకున్నారు. కాగా తెలుగుదేశం పార్టీ తరఫున మచిలీపట్నం నుంచి ఎంపీ గా రాజకీయాల్లోనూ రాణించారు. 2022 డిసెంబరు 23న కన్నుమూశారు.

స్పీకర్ కుర్చీవద్దే ఫొటో షూట్

▸▸ స్పీకర్ తీరుపై విమర్శల వెల్లువ



వైరల్ అవుతున్న ఫొటోలు ఇవే...

బెంగళూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): శాసనసభ స్పీకర్ కుర్చీవద్ద మంగళూరుకు చెందిన కాంగ్రెస్ నాయకులు ఫొటోషూట్ జరిపారు. మంగళూరు నగర పాలక సంస్థ కార్పొరేటర్ నవీన్ డిసోజా, కాంగ్రెస్ నాయకుడు అష్రఫ్‌లు స్పీకర్ యూటీ ఖాదర్‌తో కలసి ఫొటోలు తీసుకున్నారు. శాసనసభలో స్పీకర్ స్థానానికి ఎనలేని ప్రాధాన్యత ఉంది. అయితే స్పీకర్ స్థానం వద్దనే ఫొటోషూట్‌కు సంబంధించిన చిత్రాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇది నిబంధనల ఉల్లంఘన కాదా..? స్పీకర్ హోదాకు ఇచ్చే గౌరవం ఇదేనా... అంటూ అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. దక్షిణ కన్నడ జిల్లాకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు ఇటీవల విధానసౌధకు వచ్చారు. నగరపాలక శాఖ మంత్రి భైరతి సురేశ్ నిర్వహించిన సభలో పాల్గొన్నారు. ఆ తర్వాత ఫొటోలను తీసుకున్నారు. స్పీకర్‌తో కలసి కుర్చీ ముందు ఫొటోలు తీసుకోవడం పట్ల ప్రతిపక్షాలు మండిపడ్డాయి. మాజీ స్పీకర్ స్పీకర్ విశ్వేశ్వరహెగ్డే కాగేరి స్పందిస్తూ స్పీకర్ కుర్చీకి ప్రత్యేక గుర్తింపు ఉందని, అక్కడ ఫొటోషూట్ చేసుకోవడం సరికాదన్నారు. నిబంధనల ప్రకారం స్పీకర్‌కు సంబంధించిన విషయమని అయినా స్పీకర్ హోదాకు గౌరవం ఇవ్వాలని, నైతికంగా సరికాదన్నారు. కాంగ్రెస్‌కు చెందిన మాజీ స్పీకర్ బీఎల్ శంకర్ మాట్లాడుతూ స్పీకర్‌స్థానంలో కూర్చుని ఉండగా ఇతరులు ఎవరూ ఫొటో తీసుకోవడం సరికాదన్నారు. సభా కార్యకలాపాలు జరిగేటప్పుడు మాత్రమే స్పీకర్ పీఠంపై ఆసీనులవుతారన్నారు. సాధారణంగా ఎవరూ సభ లేనప్పుడు స్పీకర్ స్థానంలో కూర్చునేది ఉండదన్నారు. స్పీకర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

అన్న కొడుకును తుపాకీతో కాల్చి హత్య

బెంగళూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): తుపాకీతో అన్న కొడుకును కాల్చి హతమార్చిన సంఘటన చిక్కబళ్లాపుర జిల్లా గుడిబండ తాలూకా హంపసంద్ర గ్రామంలో బుధవారం ఉదయం చోటు చేసుకుంది. బషీర్ అహ్మద్ (66) అనే వ్యక్తి అన్న కొడుకు నజీర్ అహ్మద్‌ను తుపాకీతో కాల్చి చంపాడు. అన్న మాబూసాబ్‌పైనా మారణాయుధాలతో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడ్డ మాబూసాబ్‌ను ఆసుపత్రిలో చేర్పించారు. బషీర్ అహ్మద్ సౌదీలో పనిచేసుకుంటూ అక్కడే ఉండేవారు. ఇటీవల స్వగ్రామానికి వచ్చాడు. హత్య చేసిన కేసులో బషీర్ అహ్మద్‌ను గుడిబండ పోలీసులు అరెస్టు చేసి దర్యాప్తు చేపట్టారు.

రైల్వే డివిజన్‌కు అభివృద్ధి నిధులు

గుంతకల్లు, జూలై 24: ప్రతి సంవత్సరంలాగే ఈ బడ్జెట్‌లోనూ గుంతకల్లు రైల్వే డివిజన్‌కు పెద్ద మొత్తంలో నిధులు వస్తాయని డీఆర్‌ఎం విజయకుమార్ ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. బుధవారం మధ్యాహ్నం ప్రసారమైన జీఎం సందేశ కార్యక్రమానికి డీఆర్‌ఎం హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఆర్‌ఎం మాట్లాడుతూ డివిజన్‌లో ఇప్పటికి 73 రైల్వే స్టేషన్ల అభివృద్ధికి నిధులు వచ్చా యన్నారు. అభివృద్ధి కార్యక్రమం నడుస్తోందని, ఈదఫా కూడా డివిజన్‌లోని రైల్వే స్టేషన్లు, ప్రాజెక్టులు, బైపాస్ లైన్లకు తప్పక నిధులు మంజూరౌతాయని తెలియజేశారు. త్వరలో పింక్ బుక్ విడుదల అవుతుందని, డివిజన్‌కు ఎన్ని నిధులు వచ్చాయో బహిర్గతమౌతుందన్నారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం సుధాకర్ పాల్గొన్నారు.

రెండు రైళ్ల రద్దు

హైదరాబాదు రైల్వే డివిజన్‌లో జరుగుతున్న లైన్ పనుల కారణంగా గుంతకల్లుకు చెందిన రెండు రైళ్లను రద్దు చేసినట్లు అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంతకల్లు-బోధన్ రైలు (నెం. 07671), కాచిగూడ-గుంతకల్లు రైలు (నెం. 07670)ను ఆగస్టు నెల పూర్తిగా రద్దుచేసినట్లు తెలియజేశారు.

యాద్గిర్‌లో వందేభారత్ రైలుకు స్టాపింగ్

అనంతపురం-గుంతకల్లు మీదుగా వెళ్లే ఓ రైలుకు యాద్గిర్ రైల్వే స్టేషన్‌లో స్టాపింగ్ కల్పించినట్లు రైల్వే అధికారులు తెలిపారు. బెంగళూరు-కలబురగి (నెం. 22232) వందేభారత్ రైలుకు ఈ నెల 27 నుంచి, దాని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 22231)కు ఈ నెల 28 నుంచి ఒక నిమిషం సేపు యాద్గిర్‌లో నిలపనున్నట్లు తెలిపారు.

సీపీఆర్‌పై అవగాహన అవసరం

బెంగళూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): అత్యవసర సమయంలో ప్రతి సెకను కూడా కీలకమేనని బేసిల్ లైఫ్ సపోర్ట్, సీపీఆర్ గురించి సామాన్య ప్రజలు కూడా తెలుసుకోవాలని బిమ్స్ పేడియాట్రిక్ విభాగాధిపతి డాక్టర్ దినకర్ పృథ్వీరాజ్ అభిప్రాయపడ్డారు. సీపీఆర్ అనేది గుండెపోటుకు గురైనవారికి అత్యవసరంగా కోలుకునేలా చేసే విధానమన్నారు. ఇటీవల ఎయిర్‌పోర్ట్, రైల్వేస్టేషన్‌లలోనూ కొన్ని సంఘటనలు జరిగాయని ప్రజల్లో అవగాహన ముఖ్యమన్నారు. వైదేహి మెడికల్ కళాశాల, ఇండియన్ అకడమీ ఆఫ్ పెడియాట్రిక్స్ (ఐఏపీ) సంయుక్త ఆధ్వర్యంలో బేసిక్ లైఫ్ సపోర్ట్, సీపీఆర్‌పై 4,300మందికి శిక్షణలు ఇచ్చారు. వందమంది నిపుణులు సీపీఆర్ విధానాన్ని ప్రత్యక్షంగా వివరించారు. ఐఏపీ 2024 జాతీయ అధ్యక్షుడు జీవీ బసవరాజ్ మాట్లాడుతూ సీపీఆర్ గురించి ఇంకా ప్రజలకు చేరువ కాలేదన్నారు. విద్యావంతులందరికీ ఈ విధానం తెలిస్తే అత్యవసరంగా గుండెపోటుకు గురైనవారిని రక్షించేందుకు ప్రాణాపాయం నుంచి రక్షించే వీలుంటుందన్నారు. 100 అంబులెన్స్ డ్రైవర్‌లు, 50మంది స్కూల్‌బస్ డ్రైవర్‌లు, 150మంది ట్రాఫిక్ పోలీసులు, 150మంది క్రైం బ్రాంచ్ అధికారులు, 50మంది హొయసళ జీప్ డ్రైవర్‌లు, 400మంది టీచర్‌లు, 500మంది పీయూ విద్యార్థులు, 600మంది నర్సింగ్, ఫిజియో థెరపీ విభాగం విద్యార్థులతోపాటు ఎంబీబీఎస్‌కు చెందిన 300మంది విద్యార్థులు భాగస్వాములయ్యారు. జాతీయ నియో నాటాలజీ ఫోరం కర్ణాటక విభాగం అధ్యక్షుడు డాక్టర్ ప్రశాంత్‌గౌడ తదితరులు పాల్గొన్నారు.



సీపీఆర్‌పై అవగాహన ఇలా...

వైద్య విధానంలో సాంకేతికత పెరగాలి

▸▸ మాజీ లోకాయుక్త జస్టిస్ సంతోష్ హెగ్డే




ఏఐ సాంకేతికతను ప్రారంభిస్తున్న మాజీ లోకాయుక్త సంతోష్‌హెగ్డే తదితరులు

బెంగళూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): వైద్యవిధానంలో సాంకేతికత మరింత పెరగాలని కావేరి ఆసుపత్రిలో ఏఐ ఆధారిత జీవనశైలి జబ్బుల విభాగాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని మాజీ లోకాయుక్త జస్టిస్ సంతోష్‌హెగ్డే పేర్కొన్నారు. కావేరి ఆసుపత్రిలో ఏఐ విధానం అనుసంధానం చేయడంపై బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోష్‌హెగ్డే మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలు, రోగాలను గుర్తించి అవసరమైన చికిత్సలతో త్వరగా కోలుకునేందుకు ఏఐ సాంకేతికత తీసుకురావడం సంతోషమన్నారు. ఇండియన్ కౌన్సిల్ మెడికల్ రీసెర్చ్ నివేదిక ప్రకారం డయాబెటీస్, గుండె సంబంధిత జబ్బులు, శ్వాసకోశ వంటి సమస్యలతోనే 60శాతంమంది మృత్యువాత చెందుతున్నారనేది బాధాకరమన్నారు. 10శాతం మంది ప్రజలు ముందస్తుగా రోగ నిర్ధారణ, చికిత్సలు పొందుతున్నారన్నారు. కావేరి ఆసుపత్రుల ఫౌండర్ డైరెక్టర్ డాక్టర్ చంద్రకుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ విజయభాస్కర్, డాక్టర్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఒత్తిడిని అధిగమించే జీవనం అవసరం

విజయపుర, జూలై 24: ప్రస్తుత మారిన జీవన విధానంలో పలు కారణాలతో ఒత్తిడి పెరిగిందని, శారీరక, మానసికంగాను అధిగమించేందుకు సహజసిద్ధమైన పూర్వీకులు పాటించిన విధానాలు ఉత్తమమని దేవనహళ్ళి స్కూల్ ఆఫ్ విజ్‌డమ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్‌కే కుమార్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని రోటరీ స్కూల్ ప్రసాదనిలయలో రోటరీ విజయపుర ఆధ్వర్యంలో ఏర్పాటైన ఆరోగ్యకరమైన జీవనం కోసం ఆయుర్వేదం అనే అంశంపై ప్రసంగించారు. కనీస వ్యాయామం, సరైన విశ్రాంతి కూడా ఉత్తమ ఆరోగ్యానికి కీలకమే అన్నారు. రోటరీ అధ్యక్షుడు మహేశ్ మాట్లాడుతూ నిద్రలేమి, అధిక రక్తపోటు, తీవ్ర సమస్యలకు ఆయుర్వేదంలో ఉత్తమ చికిత్సలు ఉన్నాయన్నారు. వయస్సుకు అనుగుణంగా వైద్య చికిత్సలు పాటించడం ద్వారా మెరుగైన ఆరోగ్యం సాధ్యమన్నారు. పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఆరోగ్య పద్ధతుల గురించి వివరించారు. రోటరీ కార్యదర్శి బీ వినయ్‌కుమార్, రోటరీ పదాధికారులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న డాక్టర్ ఎస్‌కే కుమార్

27న చన్నసంద్రలో ఉద్యోగమేళా



మేళా వివరాలు వెల్లడిస్తున్న బీజేపీ నాయకులు

మహదేవపుర, జూలై 24: చన్నసంద్రలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఈనెల 27న ఉద్యోగమేళా జరగనుందని బీజేపీ హోబళి అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి వెల్లడించారు. మారతహళ్ళిలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మహదేవపుర టాస్క్‌ఫోర్స్ అధ్యక్షుడు, మాజీ మంత్రి అరవింద లింబావళి, ఎమ్మెల్యే మంజుళాల నేతృత్వంలో భారీ ఉద్యోగ మేళా జరగనుందన్నారు. 50కుపైగా ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. ఇప్పటికే 1162 మంది అభ్యర్థులు పేర్లు నమోదు చేసుకున్నారని సుమారు 3వేలమంది ఉద్యోగార్థులు పాల్గొనే అవకాశం ఉందన్నారు. పీజీ, డిగ్రీ, పీయూ/ఐటీఐ/ డిప్లమో, ఇతర కోర్సులు నాలుగు విభాగాలవారికి వారి అర్హతకు అనుగుణంగా పాల్గొనేలా వీలు కల్పించామన్నారు. మేళాను విజయవంతం చేసేందుకు అభ్యర్థులకోసం వందమంది వలంటీర్లు ఏర్పాటు చేశామన్నారు. కాగా మేళాలో పాల్గొనే దివ్యాంగులు, మంగళముఖిలకు కూడా ప్రత్యేక వ్యవస్థ కల్పించినట్టు తెలిపారు. మీడియా సమావేశంలో బీజేపీ ప్రముఖులు నటరాజ్, పాపణ్ణ, నాగేశ్‌రెడ్డి, ప్రసాద్‌బాబు ఆరాధ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సంస్కారాన్ని అలవరచుకోవాలి

శిడ్లఘట్ట, జూలై 24: చదువుతోపాటు ఉత్తమ సంస్కా రాన్ని నేర్చుకుని ఉన్నత లక్ష్యాలను అందుకునేందుకు నిరం తరం శ్రమించాలని శిడ్లఘట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ విద్యార్థులకు హితవు పలికారు. తాలూకాలోని చీమంగల ప్రభుత్వ పాఠశాలలో బుధవారం ఏర్పాటైన రైతులకు నివా ళి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పెద్దలను గౌరవించి వారి మార్గదర్శకాలతో జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ఇదే సందర్భంగా చట్టాలపై అవగాహన కలిగి ఉండ డంతోపాటు రాజ్యాంగం కల్పించిన హక్కులు, కర్తవ్యాల గురించి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.ఎన్.స్వామి, బీఈఓ నరేంద్ర కుమార్, హసిరుసేన, రాష్ట్ర రైతుసంఘం తాలూకా అధ్యక్షుడు మునేగౌడ, ప్రధాన కార్యదర్శి భక్తరహళ్ళి ప్రతీశ్, ప్రముఖులు హరికెరె మునిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్

వాల్మీకి కార్పొరేషన్ అవినీతికంటే పెద్దకుంభకోణం

▸▸ బాంబు పేల్చిన యత్నాళ్

బెంగళూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం కలిగించిన వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్ అవినీతికంటే పెద్దకుంభకోణం చోటు చేసుకుందని బీజేపీ ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్ 'ఎక్స్'లో బుధవారం పోస్టు చేశారు. కర్ణాటక హ్యాబిటేట్ కేంద్రం ఓ సంఘానికి 600 కోట్ల రూపాయలు గ్రాంటును కేటాయించిందని ఆరోపించారు. పారదర్శకమైన విధానాలు లేకుండానే కేటాయించారన్నారు. ఈ హ్యాబిటేట్ కేంద్రానికి చట్టబద్ధమైన గుర్తింపు లేకున్నా మంత్రి జమీర్ అహ్మద్ నేతృత్వంలోని ఈ కేంద్రానికి పనులు అప్పగించేందుకు అనుమతి ఇచ్చారన్నారు. హ్యాబిటేట్ కేంద్రం ప్రభుత్వ సంస్థ కాదని, ఇక్కడ పనిచేసేవారు ప్రభుత్వ ఉద్యోగులు కాదని అంతా మాయ అంటూ పోస్టు చేశారు. కల్యాణ కర్ణాటక అభివృద్ధి మండలి నుంచి కూడా ఈ హ్యాబిటేట్ కేంద్రానికి గ్రాంట్లు మళ్లించారన్నారు. వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్ అవినీతి బయటకు వచ్చిన రోజునుంచే మంత్రి జమీర్ అహ్మద్ ఈ హ్యాబిటేట్ కేంద్ర సభలను ప్రతిరోజూ జరుపుతూ మూసివేసేందుకు ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఏ ఫైల్‌కు ఎప్పుడు అగ్ని ప్రమాదం జరగనుందో అంటూ పోస్టు చేశారు.

దివ్యాంగుల నిర్వహణలో కెఫే

బెంగళూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఐఐఎం బెంగళూరు క్యాంపస్‌లో ఎస్ఎస్ఆర్‌సిఐఎల్ సహకారంతో మిట్టి కెఫె ఏర్పాటు చేశారు. ఇక్కడ శారీరక, మానసిక దివ్యాంగులే అన్ని పనులు చేయడం ప్రత్యేకత. ప్రస్తుతం 35కుపైగా మిట్టి కెఫెలు రాష్ట్రపతి భవన్, సుప్రీంకోర్టు, పలు సంస్థలు, బహిరంగ ప్రదేశాల్లో ఆహారాన్ని అందిస్తోంది. తాజాగా ఐఐఎంబీలో కెఫెను ఏర్పాటు చేసి దివ్యాంగులకు తోడ్పడేలా చేశారు. ఐఐఎంబి డైరెక్టర్ ప్రొఫెసర్ రిషికేశ్ టీ కృష్ణన్ మాట్లాడుతూ శారీరక, మానసిక సమస్యలతో బాధపడేవారికి ఇలా ఉపాధి కల్పించేలా చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు. మిట్టి కెఫె సీఈఓ, ఫౌండర్ అలీనా అలం మాట్లాడుతూ ఐఐఎంబి వంటి ప్రముఖ సంస్థలో కెఫెకు అవకాశం కల్పించడం సంతోషంగా ఉందన్నారు.



కెఫెలోని దివ్యాంగుల బృందం

సేంద్రియ సాగుపై అవగాహన

శిడ్లఘట్ట, జూలై 24: తాలూకాలోని దబరగానహళ్ళిలో సిరిధాన్యాలు సేంద్రీయ సాగుపై అవగాహన శిబిరంలో భాగంగా రైతులకు సిరిధాన్యాల విత్తనాలను పంపిణీ చేశారు. ధర్మస్థళ గ్రామాభివృద్ధి సంస్థ శిడ్లఘట్ట తాలూకా ఆధ్వర్యంలో 'రైతు క్షేత్ర పాఠశాల' కార్యక్రమంలో భాగంగా శిబిరం ఏర్పాటైంది. ఒక ఎకరాకు సరిపడా విత్తనాలను అందచేశారు. తాలూకా యోజనాధికారి సురేశ్‌గౌడ శిబిరాన్ని ప్రారంభించి సిరిధాన్యాల ప్రాధాన్యత, ఆరోగ్యకర జీవనానికి సిరిధాన్యాల వాడకం ఆవశ్యకతను వివరించారు. అదే విధంగా సేంద్రీయసాగు వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. భైరనాయకనహళ్ళి వెంకటేశ్ సిరిధాన్యాల విత్త నాల ఎంపిక, భూసార పరీక్షలు, విత్తనశుద్ధి, దిగుబడి, పంటలకోత గురించి తెలి పారు. ఆదర్శరైతు హిత్తలహళ్ళి సురేశ్, స్వసహాయ సంఘాల సభ్యులు, రైతులు పాల్గొన్నారు.



విత్తనాలతో రైతులు తదితరులు

కేంద్రంతో ఢీకి సిద్దూ సర్కారు సై

బెంగళూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వాన్ని ఢీకొనేందుకు రాష్ట్రంలోని సిద్దరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీపై తరచూ ఘాటుగా విమర్శలు చేసే సీఎం సిద్దరామయ్య ప్రస్తుతం వ్యూహాత్మకంగా కేంద్రప్రభుత్వాన్ని ఇరుకునపెట్టే ప్రయత్నాలకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. గత ఏడాది కరువు సాయం సకాలంలో అందించకపోవడంపై సుప్రీంకోర్టును ఆశ్రయించి సాధించుకున్న విషయం తెలిసిందే. అదే తరహాలోనే మరిన్ని పోరాటాలకు సిద్ధమవుతున్నారు. తాజాగా వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో జరిగిన అవినీతిపై రాష్ట్ర ప్రభుత్వం సిట్ ద్వారా దర్యాప్తు చేయిస్తుండగా ఈడీ కూడా విచారణ చేపట్టిన మేరకు ఓ అధికారి ద్వారా ఈడీకి వ్యతిరేకంగా ఎఫ్ఐఆర్ నమోదు చేయించారు. హైకోర్టు సదరు ఎఫ్ఐఆర్‌పై స్టే విధించింది. అదే తరహాలోనే వైద్య, డెంటల్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహిస్తున్న నీట్ పరీక్షలను ఉభయ సభల్లో వ్యతిరేక బిల్లు తీసుకురాదలిచారు. కేంద్ర ప్రభుత్వం ఒకే దేశం - ఒకే ఎన్నిక పరికల్పనతో జనాభా ఆధారంగా లోక్‌సభ, శాసనసభ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను వ్యతిరేకిస్తూ శాసనసభలో బిల్లు ప్రవేశపెట్టనున్నారు. నియోజకవర్గాల పునర్విభజనకు కేంద్రం సిద్ధమవుతోంది. 2026లో శాసనసభ, లోక్‌సభ నియోజకవర్గాలను పునర్విభజన చేయాలని కేంద్రం భావిస్తున్న తరుణంలోనే రాష్ట్రం నుంచి వ్యతిరేక సందేశాన్ని పంపదలిచారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న లోక్‌సభ, శాసనసభ నియోజకవర్గాల్లో ఎటువంటి మార్పులు అవసరం లేదని రాష్ట్రప్రభుత్వం భావిస్తోంది. ఇక ఒకే దేశం - ఒకే ఎన్నికను వ్యతిరేకించేందుకు రాష్ట్ర సర్కార్ సిద్ధమైంది. ఇలా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయదలిచిన మూడింటికీ వ్యతిరేకించడం ద్వారా కేంద్రాన్ని ఇరుకున పెట్టాలని భావిస్తున్నారు. శాసనసభ సమావేశాలలోనే మూడింటిపైనా బిల్లులు తీసుకొచ్చేందుకు సిద్ధమయ్యారు.

ఐఐబీఎస్‌లో ఉచిత విద్య అవకాశం

బెంగళూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బిజినెస్ స్టడీస్ (ఐఐబీఎస్) బెంగళూరులో ఉచిత విద్య అవకాశానికి దరఖాస్తు చేసుకోవాలని పిలుపునిచ్చారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన విద్యార్థులకు మాత్రమే ఉచిత విద్య వెసలుబాటు ఉంటుందన్నారు. బీబీఏ+ ఐఏఎస్ లేదా సీఏ, డిజిటల్ మార్కెటింగ్, బిజినెస్ అనలిటిక్స్, సీఎంఏ, ఏసీసీఏ, బీకామ్+, ఐఏఎస్/సీఏ, సీఎంఏ, ఏసీసీఏ, డిజిటల్ మార్కెటింగ్ అనలిటిక్స్, బీసీఏ+ ఐఏఎస్, ఏఐఎంఎల్, సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హ్యాకింగ్, డేటా సైన్స్, బీఏ+ ఐఏఎస్/ లిబరల్ ఆర్ట్స్ కోర్సులలో చేరవచ్చునన్నారు. ఎస్ఎస్ఎల్‌సీ, పీయూసీలలో మార్కుల శాతానికి అనుగుణంగా సీట్లు కేటాయిస్తామన్నారు. జనరల్ కేటగిరీలో 90 శాతానికిపైగా, ఓబీసీ కేటగిరీలో 85శాతానికిపైగా, ఎస్సీ, ఎస్టీలకు 80శాతానికిపైగా మార్కులు ఉండాలన్నారు. దరఖాస్తులు వెబ్‌సైట్ ద్వారా లేదా నేరుగా అందించవచ్చునని ఈనెల 27లోగా సమర్పించాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 90004 53555కు సంప్రదించాలన్నారు. జాల హోబళి ఎయిర్‌పోర్ట్ సమీపాన ముత్తుగదహళ్ళిలో క్యాంపస్ ఉన్నట్టు తెలిపారు.

కేఎస్ఎఫ్‌సీ డైరెక్టర్‌గా రఘు ఆచార్ ఏకగ్రీవ ఎన్నిక



రఘు ఆచార్

బెంగళూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక స్టేట్ ఫైనాన్స్ కమిషన్ పాలక మండలి డైరెక్టర్‌గా మాజీ ఎమ్మె ల్సీ సి.జి.రఘు ఆచార్ ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. మూడేళ్లపాటు ఆయన డైరెక్టర్‌గా కొనసాగనున్నారు. ఈ మేరకు కేఎస్ఎఫ్‌సీ ఎండీ డాక్టర్ రేజు బుధవారం ప్రకటించారు. రఘు ఆచార్ గతంలో ఇండి పెండెంట్ ఎమ్మెల్సీగా కొనసాగారు. ఆ తర్వాత ఎన్నికల్లో ప్రయత్నించినా ఆయన గెలుపు సాధించలేదు.

కేజీఎఫ్ నగరాభివృద్ధి ప్రాధికార అధ్యక్షుడిగా గోపాలరెడ్డి

బంగారపేట, జూలై 24: దొడ్డరుకరపనహళ్ళి గ్రామ పంచాయతీ సభ్యుడు, సమాజ సేవకుడు అయిన జి గోపాలరెడ్డిని కేజీఎఫ్ నగరాభివృద్ధి ప్రాధికార నూతన అధ్యక్షుడిగా నియమితులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శి కె.లతా ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. డి.కె.హళ్ళి జిల్లా పంచాయతీలో పోటీ చేయాలని భావించిన గోపాలరెడ్డి ఐదారు సంవత్సరాలుగా సమాజసేవలోనూ రాణిస్తున్నారు. ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామికి అనుచరుడు కావడంతో ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఆయనకు అవకాశం కల్పించారు. 2018, 2023 శాసనసభ ఎన్నికల్లో డికె హళ్ళి జిల్లా పంచాయతీ పరిధిలో ఎమ్మెల్యేకు ఎక్కువ ఓట్లు రావడంలో గోపాలరెడ్డి క్రియాశీలకంగా వ్యవహరించారు. ఎమ్మెల్యే, కర్ణాటక నగర మౌలిక సదుపాయాల అభివృద్ధి మండలి అధ్యక్షుడు అయిన నారాయణస్వామి బుధవారం గోపాల రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు.

భక్తిగీతాల చైతన్య గీతామృతం సీడీ విడుదల

చింతామణి, జూలై 24: భక్తిభావాలతో ఆధ్యాత్మిక చైతన్యం సాధ్యమవుతుందని హుబ్బళ్ళి చైతన్యాశ్రమానికి చెందిన దత్తావధూత అభిప్రాయపడ్డారు. చింతామణికి చెందిన సాహితీవేత్త జి జయరాం రచించిన భక్తి గీతాలతో కూడిన చైతన్య గీతామృత సీడీని విడుదల చేశారు. హుబ్బళ్ళి సమీపంలోని ఆశ్రమంలో ఏర్పాటైన కార్యక్రమ వివరాలను జయరాం పట్టణంలో మీడియాకు తెలిపారు. నేటి యాంత్రిక జీవనంలో ప్రగతి సాధించవచ్చునని అయితే మనశ్శాంతి లభించడం కష్టంగా మారిందన్నారు. ఆధ్యాత్మికత లేకుంటే మానసిక ప్రశాంతత కష్టమేనని అభిప్రాయపడ్డారు. పిల్లలకు కూడా భక్తి భావాలు కలిగి ఉండేలా ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలన్నారు. గాయకుడు పంచమ్ హళబండి మాట్లాడుతూ తమ కుటుంబం చైతన్యాశ్రమ సద్గురు ఆశీర్వాదంతో చక్కగా ఉందన్నారు. సీడీ విడుదల కావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సంగీత దర్శకుడు ఎస్ఎస్ ప్రసాద్, గాయకుడు ప్రీతం హళబండి తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో సులభంగా ఆదాయ పన్ను చెల్లింపు

అనంతపురం సెంట్రల్, జూలై 24: ఆన్‌లైన్‌లోనే ఆదాయ పన్నును సులభంగా చెల్లించవచ్చని ఇన్‌కమ్ ట్యాక్స్ ఆఫీసర్(ఐటీఓ) విజయలక్ష్మి పేర్కొన్నారు. ఆదాయపన్ను 165వ వార్షికోత్సవాన్ని బుధవారం ఆ శాఖ కార్యాలయంలో ఐటీఓ విజయలక్ష్మి కేక్‌కట్‌చేసి ప్రారంభించారు. అనంతరం పన్ను చెల్లింపు దారులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో విజయలక్ష్మి మాట్లాడుతూ అసెస్మెంట్ ఇయర్ 2024-25 రిటన్స్ ఫైల్‌ను ఈ నెల 31లోపు ప్రభుత్వ వేతన ఉద్యోగులు సబ్‌మిట్ చేయాలని సూచించారు. సెక్షన్ 80సీ కింద ఆధారాలు సమర్పించగలిగే ఎలిజిబిలిటి డిడక్షన్‌ను మాత్రమే క్లైమ్ చేయాలన్నారు. తప్పుడు రిటన్స్ ఫైల్ చేయకుండా కరెక్ట్ అండ్ ట్రూ ఇన్‌కమ్ ట్యాక్స్ రిటన్స్ ఫైల్ చేయాలని కోరారు. రాంగ్ డిడక్షన్ చేసేవారికి సెక్షన్ 270ఏ కింద జరిమానా విధిస్తారన్నారు. అంతకుముందు కార్యాలయ ఆవరణంలో శ్రమదానం నిర్వహించారు.